# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి.**

2. **రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలన వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్న ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్.**

3. **రాజధాని గ్రామాల్లో రెండో విడత భూ సమీకరణలో 7 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించనున్నామని వెల్లడించిన పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ.**

4. **పోలవరం ప్రాజెక్టు పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయన్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

5. **పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి-ఎస్ఐపిబి ఈరోజు సమావేశమైంది. అమరావతి రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో 26 సంస్థలకు చెందిన 20 వేల కోట్ల రూపాయల పెట్టుబడుల ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో, మంత్రులతో చర్చిస్తున్నారు. ఐటి, పర్యాటకం, ఆహార శుద్ధి గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపనుంది. అలాగే విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న వివిధ ఒప్పందాలకు ఆమోదం తెలుపనున్నారని అధికారులు పేర్కొన్నారు. ఎస్ఐపిబి సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ-సిఆర్‌డిఎ సమావేశంలోనూ పాల్గొంటారు.

---------------------------

రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలన వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని చిత్తూరు డివిజనల్ అభివృద్ధి అధికారి-డీడీవో కార్యాలయాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన 77 డీడీవో కార్యాలయాలకు దృశ్య మాధ్యమం విధానంలో ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాజధాని గ్రామాల్లో రెండో విడత భూ సమీకరణలో 7000ఎకరాలకు పైగా భూమిని రైతుల నుండి సేకరించనున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని యండ్రాయిలో మంత్రి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా రెండో విడత భూసమీకరణపై గ్రామస్థులు, రైతులతో సమావేశమై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..27 సెకన్లు

---------------------------

పోలవరం ప్రాజెక్టు పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి మంత్రి ఈరోజు పరిశీలించారు. డయాఫ్రమ్ వాల్, కుడి కాలువతో పాటు గ్యాప్-1, గ్యాప్-2 వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రాజెక్ట్ పనుల పరిశీలన అనంతరం అధికారులతో ప్రాజెక్ట్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని మంత్రి నిర్వహించారు.

---------------------------

విశాఖపట్నం వేదికగా ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ మిలన్ 2026 నౌకా విన్యాసాలను ఫిబ్రవరిలో నిర్వహించనున్నామని తూర్పు నౌకాదళ ప్రధానాధికారి, వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా వెల్లడించారు. విశాఖపట్నంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

అలాగే నౌక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలోని సముద్ర తీరంలో నౌకా విన్యాసాలను, కవాతును తూర్పు నావికాదళం ఈరోజు సాయంత్రం నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు.

---------------------------

భారత దేశ తీర ప్రాంతాన్ని పటిష్టంగా ఉంచడంలో నౌకాదళం అందిస్తున్న విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఈరోజు నౌకాదళ దినోత్సవం నిర్వహిస్తున్నారు. భారత – పాకిస్తాన్ యుద్ధం సందర్భంగా 1971 వ సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన పాకిస్తాన్‌లోని కరాచీ హార్బర్ పై భారత నౌకా దళం మెరుపు దాడి చేసి ఆ దేశానికి తీవ్ర నష్టం కలిగించింది. భారత నౌకాదళం జరిపిన ఈ దాడిలో పాకిస్తాన్‌కు చెందిన నాలుగు నౌకలు మునిగిపోయాయి. ఇంధన నిల్వ క్షేత్రాలు కూడా ధ్వంసం కావడంతో పాకిస్తాన్‌కు భారీ నష్టం వాటిల్లింది. భారత నౌకా దళం "ఆపరేషన్ ట్రైడెంట్" పేరుతో ఈ దాడి నిర్వహించింది. ఈ ఆపరేషన్ విజయ స్మృతులను గుర్తు చేసుకుంటూ దేశ ప్రజలు ఈ రోజు నౌకా దళ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

మొంథా తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ

కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

“సంచార్ సాథీ” యాప్‌కు పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా, కొత్తగా వచ్చే సెల్ ఫోన్‌లలో ఈ యాప్‌ను ముందస్తుగా ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరి కాదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ యాప్ పౌరులు వినియోగదారుల భద్రతకు మాత్రమే ఉద్దేశించిందని ఎప్పుడు కావాలంటే అప్పుడు యాప్ ను తొలగించవచ్చని స్పష్టం చేసింది. ఇప్పటివరకు 1.4 కోట్ల మంది వినియోగదారులు ఈ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపింది. గడిచిన ఒక రోజులో 6 లక్షల మంది పౌరులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడానికి నమోదు చేసుకున్నారని, దీని వినియోగం 10 రెట్లు పెరిగిందని కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

కాశీ తమిళ సంగమంలో భాగంగా కాశీలో పర్యటిస్తున్న మొదటి ప్రతినిధి బృందం ఈరోజు అయోధ్యను సందర్శిస్తుంది. ఇందులో భాగంగా అయోధ్యలోని ప్రధాన దేవాలయాలైన శ్రీ రామ జన్మభూమి, హనుమాన్‌గరి వంటి ఇతర ముఖ్యమైన ప్రదేశాలను సందర్శిస్తుంది. అనంతరం అయోధ్యలోని శ్రీరామ్ ఆడిటోరియంలో నిర్వహించే సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ ప్రతినిధి బృందం హాజరవుతుంది. తమిళ సంగమం ప్రతినిధుల పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని అయోధ్య జిల్లా కలెక్టర్ నిఖిల్ టికారం ఫండే తెలిపారు.

---------------------------

దిత్వా తుఫాన్ బలహీనపడినప్పటికి రాష్ట్రంలోని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇక ఆంధ్రప్రదేశ్, యానా దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..29 సెకన్లు

---------------------------

గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఈ నెల 18వ తేదీ నుంచి “రాష్ట్ర యువజన ఉత్సవం -2025”ను నిర్వహించనున్నామని యువజన సేవల శాఖ కమిషనర్ ఎస్. భరణి తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ-శాప్ కార్యాలయంలో యువజన ఉత్సవం గోడ పత్రికను ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత ప్రతిభను వెలికితీసే వేదికగా యువజనోత్సవాలు నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకత ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. పోటీల్లో పాల్గొనాలనుకునే యువతీ, యువకులు తమ పేరు లేదా బృందం పేరును www.apyouthfestival.com వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

====================